# నారీమణుల నృత్య నీరాజనం

- కోలాటంపై మహిళల్లో పెరుగుతున్న ఆసక్తి
- ఆధ్యాత్మిక చింతనతో పాటు ఉపాధి

**విశాఖ విద్య:** ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరిగే పండగలు, ఉత్సవాల్లో 'కోలాటం'కు ప్రత్యేక స్థానం ఉంది. తరాలు మారినా.. సంప్రదాయ నృత్యానికి వన్నె తగ్గలేదు. గ్రామాలు..పట్టణాల్లో డీజే మోతలు మెగినా, కోలాటం ఉంటేనే ఆ ఉత్సవానికి పరిపూర్ణం అనేంతలా ఈ ప్రాంత ప్రజానీకం మదిలో సుస్థిర స్థానం సంపాదించుకుంది. ఒకప్పుడు మగవారు మాత్రమే కోలాటం ఆడేవారు. నేటి రోజుల్లో మహిళలు సైతం దీనిపై ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. కోలాటం మహిళల్లో సమైక్యతను పెంపొందిస్తోంది. ఆధ్యాత్మిక చింతనతో పాటు ఉపాధికి బాటలు వేస్తుంది. దుర్గాపురం 'శ్రీరామ కోలాటం' గ్రూపు ఏర్పడి మంగళవారం నాటికి ఏడాది పూర్తి కావడంతో తొలి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


కోలాటం ఆడుతున్న దుర్గాపురం కాలనీ వాసులు

### కోలాటం స్పెషల్ దుర్గాపురం

జీవీఎంసీ 57వ వార్డు ఎన్ఏడీ సమీపంలోని దుర్గాపురం మహిళలు కోలాటంలో ప్రత్యేకత చాటుకుంటున్నారు. 'శ్రీ రామ కోలాటం' పేరుతో మహిళా సంఘాన్ని ఏర్పాటు చేసుకొని 30 మంది కోలాటం ఆడుతున్నారు. 'బుజ్జి గణపయ్య' పాటతో మొదలయ్యే కోలాటంలో 44 పాటలకు చూపరులను ఆకట్టుకునేలా తమ నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. 'వేపచెట్టు ఉయ్యాలో' అని సాగే పాటకు చేసే ప్రదర్శన హైలెట్‌గా నిలుస్తోంది.


పాటకు తగ్గట్టుగా..

### ఆధ్యాత్మికత...ఉపాధి

కాలనీకి చెందిన 30 మంది మహిళలు ప్రస్తుతం గ్రూపుగా ఏర్పడి కోలాట ప్రదర్శన ఇస్తున్నారు. దుర్గాపురంలో ఎలాంటి వేడుకైనా వీరి కోలాటం ఆడాల్సిందే. ఆధ్యాత్మిక చింతనతో పాటు ప్రస్తుతం ఉపాధి సైతం లభిస్తోండడంతో మరింత మంది కోలాటం నేర్చుకుంటున్నారు. జిల్లాలోనే కాకుండా విజయనగరం, శ్రీకాకులం జిల్లాల్లో జరిగే వేడుకలు, కార్యక్రమాలకు వీరు కోలాటం ఆడేందుకు వెళ్తున్నారు. ఇలా వేడుకను భట్టి రూ.6వేలు నుంచి రూ.20 వేలు వరకు తీసుకుంటూ కోలాట ప్రదర్శన ఇస్తున్నారు.

### ఉపాధి చూపుతోంది



నేను డిగ్రీ చదువుకున్నాను. ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నాను. కోలాటం సరదాగా నేర్చుకున్నాం. కానీ ఇప్పుడే ఇది ఉపాధి కూడా చూపిస్తోంది. టీచర్‌గా వృత్తి కొనసాగిస్తూనే అందరితో పాటు కార్యక్రమాలకు వెళ్తున్నాను. మా కాలనీలో శ్రీరామ కోలాటం సభ్యులంతా ఓ కుటుంబంలా ఉంటాం.

-కె. దేవి, దుర్గాపురం

### చదువుతో పాటూ..



నేను ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. కోలాటం ఆడటం అంటే ఎంతో ఇష్టం. చదువుకుంటూనే కోలాట ప్రదర్శనలకు వెళ్తున్నాను. ఇష్టంతో నేర్చుకున్న కోలాటం ప్రస్తుతం ఉపాధి కూడా ఇస్తోంది. అంతా సమైక్యంగా దీనిలో పాల్గొంటున్నాం.

-తేజశ్రీ

### మేమంతా ఓ కుటుంబం



మా కాలనీలో వేడుకలకు కోలాటం ఆడేందుకు ఎవరూ రాకపోవడంతో తామెందుకు నేర్చుకోకూడదనే పట్టుదలతో ప్రారంభించాం. మూడు నెలల కాలంలోనే కోలాటంలో ప్రావీణ్యం సంపాదించాం. మా గ్రామంలో అయితే డబ్బులు తీసుకోకుండానే కోలాటం ఆడుతాం. అంతా ఒక కుటుంబంలా దీనిలో పాల్గొంటాం.

-బి. హేమలత, గ్రూపు లీడర్

### ఆధ్యాత్మిక చింతన



కోలాటం వల్ల ఆధ్యాత్మిక చింతన లభిస్తోంది. వయసుతో సంబంధం లేకుండా అందరూ దీన్ని ఆడేందుకు ఇష్టపడుతున్నారు. దేవుని భక్తితో పాటు, మా అందిరి మధ్య మరింత స్నేహం పెంచేలా కోలాట ప్రదర్శన ముందుకు సాగుతుంది. చూసే వారు కూడా ఎంతో ప్రోత్సహిస్తారు. అందుకే మరింత ఇష్టంతో చేస్తున్నాం.

– డి. రమ

# విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

**మురళీనగర్:** మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ మహిళలు శాశ్వత ప్రాజెక్టు వర్క్ అమలులో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు మంగళవారం ఉపకార వేతనాలు అందించారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ రంగారావు, క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభ శర్మ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు అందరికి ఆదర్శంగా నిలుస్తారని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.హేమలత, డిస్ట్రిక్ట్ 101 కార్యదర్శి బలిరెడ్డి సత్యనారాయణ, పూర్వ అధ్యక్షులు జె.ఉమాదేవి, జయప్రభాశర్మ, ఉపాధ్యక్షురాలు పి.మహాలక్ష్మి, జాలివాకర్ ఎం.ప్రమీల రావు, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నాయీ బ్రాహ్మణులకు అండగా నిలుస్తాం

**విశాఖ విద్య:** నాయీ బ్రాహ్మణులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నరవ పైడిరాజు ఆధ్వర్యంలో సంఘం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే గణబాబును సత్కరించారు. నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ బీసీ వర్గాలకు మేలు చేసేలా భవిష్యత్‌లో తగిన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెంటరావు, సత్యనారాయణ, వర్మ, గణపతిరావు, నారాయణరావు, శంకర్రావు, వడ్డాది కనకరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### చురుగ్గా కాలువ మరమ్మతులు

**విశాఖ విద్య:** జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో డ్రైనేజీ, కాలువ మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. పనులను మంగళవారం వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పరిశీలించారు. కొండవాలు ప్రాంతమైన దుర్గమ్మ గుడి వద్ద డెబ్రిస్ క్లియర్ చేస్తుండగా సీసీ కాలువ గట్టు తెగి మురుగునీరు సమీప ఇళ్లల్లోకి వచ్చింది. దీంతో పరిసర ఇళ్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రమణ అక్కడికి చేరుకొని జీవీఎంసీ సిబ్బందిని పిలిపించి మురుగునీటిని తొలగించడంతో పాటు కాలువ మరమ్మతులు పూర్తి చేయించారు.

### పట్టపగలే వెలుగులు


వెంకన్నపాలెంలో వెలుగుతున్న వీధి లైట్లు

**మల్కాపురం:** పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వీధి లైట్లు పగలు వెలుగుతూ ఉన్నాయి. 61వ వార్డు మల్కాపురం సమీపాన వెంకన్నపాలెం వద్ద పలు చోట్ల వీధి లైట్లు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వెలుగుతూనే ఉన్నాయి. రెండు వారాల నుంచి ఇదే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై జీవీఎంసీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా వారు స్పందించడం లేదని పేర్కొంటున్నారు.

### స్టీల్‌ప్లాంట్ వెల్‌నెస్ సెంటర్‌కు ఈవోఐ విడుదల



**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్‌లోని ఉక్కు స్టేడియం ఆవరణలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌కు ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. సుమారు 5 వేల చదరపు అడుగులు కలిగిన ఆర్‌సీసీ బిల్డింగ్ ప్రాంగణాన్ని 10 ఏళ్ల పాటు అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను జూలై 6 వరకు స్టీల్ ప్లాంట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. దరఖాస్తుకు జూలై 13ను ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఆసక్తి గల వ్యక్తులు, పార్టీలు గడువు వ్యవధిలోగా తమ దరఖాస్తులు అందజేయాలని తెలియజేశారు.

### ముగిసిన సీబీసీ యోగా చిత్ర ప్రదర్శన

**మహారాణిపేట:** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహిస్తున్న చిత్ర ప్రదర్శన మంగళవారం ముగిసింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఈ చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. యోగాసనాలు, యోగా ప్రక్రియలు, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ చిత్ర ప్రదర్శనను తిలకించడానికి బీచ్‌కు వచ్చిన సందర్శకులు ఆసక్తి చూపారు. వివిధ కళాశాలలు, పాఠశాలల్లో యోగాపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

# వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

**అక్కిరెడ్డిపాలెం:** భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా జరిపించారు. నాతయ్యపాలెం జాతీయ రహదారి పక్కనున్న శ్రీనివాస కల్యాణ మండపంలో శ్రీహరి సేవా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పి.రంగనాథాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేదిక అధినేత టి.సుధాకర్ రెడ్డి, రామనిర్మల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యానం ఆకట్టుకుంది. భక్తి సంగీత సేవా సంస్థ శృతిలయ అధ్యక్షుడు వి.ప్రభాకర్ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. విశాఖ నగరంతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన 2 వేల మంది శ్రీహరి సేవకులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీహెచ్.వి.సత్యనారాయణ, ఎం.ఎస్. మాధవ్, కొణతాల రాజు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపిస్తున్న వేద పండితులు

## వైభవంగా స్నపన తిరుమంజనం


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

**కొమ్మాది :** రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- డిప్యూటీ మేయర్ శ్రీధర్
- జీవీఎంసీ అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటన

**విశాఖ విద్య:** ప్రజావసరాలు తీర్చేలా కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ వివిధ విభాగాల అధికారులతో కలసి మంగళవారం 52వ వార్డులో పర్యటించారు. మర్రిపాలెం వుడా లే అవుట్‌లో అదనపు మౌలిక సౌకర్యాలు కల్పించాలనే కాలనీ వాసులు విజ్ఞప్తి మేరకు అధికారులతో కలిసి పరిశీలన చేశారు. వార్డు పరిధిలో పలు చోట్ల జరుగుతున్న డ్రైనేజీ మరమ్మతులు, రహదారుల అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఎన్ఏడీ వరకు ఉన్న గ్రీన్ బెల్ట్ ఏరియాలో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు నిధులు ఉన్నందున సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రతిపాదనలు చేసి వాటికి నిధులు మంజూరయ్యేలా చూడాలన్నారు. పర్యటనలో ఇంజినీరింగ్ విభాగం ఈఈ ప్రసన్న రెడ్డి, ఏఈ ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాల కృష్ణ , వుడా లే అవుట్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, అధికారులు

# మాదకద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

**పెదగంట్యాడ:** మాదకద్రవ్యాలతో అన్నీ అనర్థాలేనని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వై.లక్ష్మీనాయుడు అన్నారు. వాటికి అలవాటు పడి, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దని హితవు పలికారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లను దరి చేరనీయవద్దని, చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్నా, విక్రయించినా వెంటనే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రమ్యశ్రీ , పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీనాయుడు

## 'స్టీల్‌ప్లాంట్ స్టాక్ యార్డుల అమ్మకాన్ని విరమించుకోవాలి'

**ఉక్కునగరం:** దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్ స్టాక్ యార్డ్‌ల అమ్మకాలను విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్లాంట్ ప్రారంభ సమయంలో ఉక్కు ఉత్పత్తుల అమ్మకం, నిల్వ కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, ఢిల్లీ, పూణే తదితర ప్రధాన నగరాల్లో యార్డులను కొనుగోలు చేశారన్నారు. కీలకమైన ప్రాంతాల్లో స్టాక్ యార్డులు ఉండటం వల్ల టాటా, జిందాల్ వంటి సంస్థలతో పోటీ పడుతున్నామని చెప్పారు. స్టాక్ యార్డ్‌లను అమ్మడం అంటే ప్లాంట్ ఉత్పత్తులకు ఉన్న గిరాకీని కోల్పోవడమే అని, తద్వారా ఉన్న మార్కెట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడమే అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మార్కెటింగ్ యార్డ్‌లను రూ.476 కోట్లకు అమ్మాలనే నిర్ణయాన్ని స్టీల్ సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. తక్షణం ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు.

## షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నేడు

**మురళీనగర్:** హిందుస్థాన్ షిప్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం మాధవధార మున్సిపల్ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించనున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు దాటిన 15 మంది సభ్యులను సూపర్ హీరోస్ టైటిల్‌తో సత్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల వరకు వై.అప్పారావు పర్యవేక్షణలో వినోద కార్యక్రమాలు ఉంటాయని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

# హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలి

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ కోరారు. మంగళవారం ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.సీతామాణిక్యంను కార్యాలయంలో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం నుంచి ఏయూలో ఈ కోర్సుల నిర్వహణ జరుగుతోందని, వీటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడానికి ఈ కోర్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న శ్యామ్‌ప్రసాద్ తదితరులు

- న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యంను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య రాజేంద్రప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# కూలిన చెట్టుకు పునరుజ్జీవం

**కేజీహెచ్‌లో అరుదైన ఘటన**


జేసీబీ సహాయంతో చెట్టును యథాస్థానంలో నిలబెడుతున్న దృశ్యం


చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంట్ చేస్తున్న నిపుణులు

**మహారాణిపేట:** ఇటీవల కురిసిన వర్షాలకు కేజీహెచ్‌లో నెలకొరిగిన మహా వృక్షానికిమంగళవారం పునర్జీవం కల్పించారు. ఆస్పత్రిలోని పార్కింగ్ ఆవరణలో గల 25 అడుగుల ఎత్తున్న బాదం చెట్టు వేళ్లతో సహా నేలకొరిగింది. అలా పడిన చెట్టును నరికేయకుండా తిరిగి యథాతథంగా నిలబెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పదుగురికీ ఉపయోగపడే ఆ చెట్టును నరికి పడేయకుండా తిరిగి నిలబెట్టేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చర్యలు చేపట్టారు. ఆ చెట్టులో కొన్ని కొమ్మలు తొలగించి, చెట్టు మానులో కూడా కొంత భాగాన్ని తొలగించి ఫంగల్ చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన క్లైమేట్ ఫ్రంట్ అనే సంస్థ సహకారం తీసుకున్నారు. జేసీబీ సహాయంతో చెట్టు పడిన ప్రాంతానికి 50 మీటర్ల దూరంలోని వేరే స్థలంలో తిరిగి నాటారు. వర్షాలకు పడిపోయిన చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంటు చేయటం వల్ల చెట్టు చిగురించి బతుకుందని క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధి భట్టాచార్య తెలిపారు. గతంలో కాకినాడలో ఓఎస్‌టీఏస్ అనే సంస్థ ద్వారా అక్కడి వైద్య కళాశాలలో కూడా పడిపోయిన చెట్టును తిరిగి పునర్జీవింపజేసినట్లు కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కేజీహెచ్ ఏఆర్ఎంవో డాక్టర్ దవళ భాస్కర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు లోకనాథ్, మేనేజర్ జె.ఎం.జవహర్ తదితరులు పాల్గొన్నారు.


తిరిగిన నాటిన తర్వాత ఠీవిగా నిల్చున్న బాదం చెట్టు

# అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలో ని వేదికపై ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంఐధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

## సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి

# భక్తిశ్రద్ధలతో సువాసిని పూజ

**సీతంపేట:** అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సువాసినీ పూజ నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజ ఆచరించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి సమక్షంలో పండితుల వేద మంత్రాల మధ్య ఈ పూజను శాస్త్రోక్తంగా చేశారు. పీఠం దర్బారు హాల్లో లలితాదేవిని పూలదండలతో అలంకరించారు. ముందుగా సామూహిక లలిత సహస్ర పారాయణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాదీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొని భక్తులను ఆశీర్వదించారు.


ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

### భక్తసత్కీర నాటక ప్రదర్శన నేడు

మీగడ రామలింగస్వామి బృందం సభ్యులతో బుధవారం సాయంత్రం 6 గంటలకు లలితా పీఠంలో 'భక్తసత్కీర'నాటకం ప్రదర్శన జరుగుతుందని పీఠం మేనేజర్ కృష్ణసేన్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.